

## సమగ్ర శిక్ష ఉద్యోగుల బదిలీల షెడ్యూల్

**- 19 నుంచి 21లోగా దరఖాస్తుకు అవకాశం**

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు అల్లూరి జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్.వి.వి స్వామినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని, జూన్ 19 నుంచి జూలై 2వ తేదీ వరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈనెల 19 నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో బదిలీల దరఖాస్తులు అందించాలన్నారు. ఈనెల 23న సీనియారిటీ జాబితా తయారీ, 24న ప్రదర్శన, 27న అభ్యంతరాల స్వీకరణ, 28న తుది మెరిట్ జాబితాను ప్రకటిస్తామని, 30 నుంచి జూలై 2వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. స్పెషల్ కేటగిరీల వారిగా పాయింట్స్, స్పౌజ్, అవివాహితులు, స్పౌజ్ తదితర వారికి ప్రత్యేక పాయింట్ లు ఉంటాయని తెలిపారు.

## బీసుపురం వ్యూ పాయింట్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

**• సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు**



కాఫీ పొడి వ్యాపారులతో మాట్లాడుతున్న గంగరాజు

**ప్రజాశక్తి -అనంతగిరి:** మండలంలోని ఎగువశోభ పంచాయతీ బీసుపురం కాఫీ ప్లాంటేషన్ వద్ద వుడెన్ బ్రిడ్జి, వ్యూ పాయింట్ ఏర్పాటుతో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని స్థానిక సిపిఎం, జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. కాఫీ బోర్డు, ఎపిఎఫ్‌డిసి, జిల్లా కలెక్టర్ గతంలో ఇచ్చిన అనుమతుల ప్రకారం నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరారు.

మంగళవారం బీసుపురం కాఫీ పొడి అమ్ముకొని జీవనోపాధి పొందుతున్న గిరిజన వర్తకులతో మాట్లాడుతున్న అరకు మెయిన్ రోడ్డుకు ఆనుకొని బీసుపురం కాఫీ పాయింట్ వద్ద 2005 నుండి నిరుద్యోగ గిరిజన కాఫీ తోటల కేంద్రంగా కాఫీ పొడి అమ్ముకొంటూ జీవనోపాధి సాగిస్తున్నారన్నారు. బీ నేపథ్యంలో బీసుపురం కాఫీ పాయింట్‌ను సుందరమైన కాఫీ పాయింట్ మాదిరిగా బీసుపురం పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. బీసుపురం కాఫీ పాయింట్‌లో కూడా ఉడెన్ బ్రిడ్జి, పార్క్ లు నిర్మించి గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు తలదన్నేలా టూరిజం అభివృద్ధి చేయాలని, గిరిజనుల జీవనోపాధికి ఊతమివ్వాలని గంగరాజు కోరారు. కాఫీ పొడి విక్రయిస్తున్న గిరిజన యువతీయువకులకు ప్రభుత్వపరంగా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు వ్యక్తిగత రుణాలను మంజూరు చేసి వారి వ్యాపారాలకు ప్రోత్సాహమివ్వాలని కోరారు. కాఫీ వ్యాపారుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి, బోకారు సర్పంచ్ కిల్లో. మొస్య యువత. కొర్ర.మోహన్ చంద్ర, గెమ్మెలిచిట్టిబాబు, గెమ్మెల.రాము, జి.అప్పలరాజు, కొర్ర.రాజు, కె.సింహాద్రి, కె.మహేష్, ప్రసాద్, జి.సునీల్, గెమ్మెల.రేణుక, శాంతి, చంప పాల్గొన్నారు.

# అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

- ప్రజాధనం వినియోగమైనా కానరాని ప్రయోజనం
- నిర్మాణం నిలిచిపోవడంతో నిరుపయోగంగా సచివాలయం ఆర్‌బికె భవనాలు
- అవస్థలు పడుతున్న ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు



అరకొర పనులతో నిలిచి ఉన్న సచివాలయం, ఆర్‌బికె భవనాలు

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ:** మండలంలోని కించమండలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్ర భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన ఈ భవనాలు ప్రస్తుతం అరకొర పనులతో నిలిచిపోవడంతో ఎందుకు పనికి రాకుండా ఉన్నాయి. శ్లాబ్ దశ వరకు పనులు చేపట్టి, తర్వాత ప్లాస్టింగ్, ఇతర ఫినిషింగ్ పనులు చేయకుండా వదిలేశారు. దీంతో వీటి నిర్మాణానికి ప్రజాధనం వినియోగించినా ప్రయోజనం లేకుండా పోతోందని పలువురు వాపోతున్నారు.

**పరాయిపంచన సచివాలయం, ఆర్‌బికె**

ఇదిలా ఉంటే సొంత భవనాలు లేకపోవడంతో సచివాలయం రైతు భరోసా కేంద్రాలను ప్రస్తుతం పరాయి పంచన నిర్వహణను సిబ్బంది కొనసాగిస్తున్నారు. అయితే ఆ భవనాలు వర్షాకాలంలో వర్షాలకు కారిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నామనిసిబ్బంది అంటున్నారు. ప్రతి పంచాయతీ కేంద్రంలో సొంతభవనాలు ఉండాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం సచివాలయ భవనాలను నిర్మించింది. అయితే ఈ భవనాలు అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో నిరుపయోగంగా ఉన్నాయి. తక్షణమే అసంపూర్తి భవన నిర్మాణాలను పూర్తిచేసి, వినియోగంలోకి తేవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**- సిఐటియు**

**ప్రజాశక్తి - ఎటపాక :** లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కార్మికుల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని జూలై 9న కార్మికసంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, అంగన్‌వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి బి.నిర్మల పిలుపునిచ్చారు. మంగళవారం అంగన్‌వాడి యూనియన్ ప్రాజెక్టు సమావేశం ఎటపాకలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, అంగన్‌వాడి జిల్లా కార్యదర్శి నిర్మల మాట్లాడారు. బ్రిటిష్ కాలంలో కార్మికుల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్‌కోడ్‌లు బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలుగా తయారు చేసే ప్రయత్నంలో ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పేందుకు నష్టాల్లో ఉన్నాయని సాకు చెప్పి దివాలా తీస్తున్నారని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని కారు చౌకగా అమ్మేందుకు కుట్ర చేసిందని, వ్యతిరేకించే కార్మికులను 5400 మందిని తొలగించిందన్నారు. అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడిలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను ప్రతిఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటి నాయకులు హరినాథ్, అంగన్వాడి నాయకులు రాజేశ్వరి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

# ప్రభుత్వ పథకాల అమలే లక్ష్యం

**ప్రజాశక్తి -అనంతగిరి :** అర్హులైన వారందరికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందించడమే దర్తి అబా జన్ భగీదరి అభియాన్ గ్రామసభల లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ ఎడి రంగరావు అన్నారు. మంగళవారం గుమ్మకోటలో జాతీయ గౌరవ వర్ష వేడుకలలో భాగంగా దర్తి అబా జన్ భగీదరి అభియాన్ అనే గ్రామసభ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ పాగి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఎంపిపి శెట్టి నీలవేణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపిపి నీలవేణి, సర్పంచ్ అప్పారావు మాట్లాడుతూ, అర్హులై ఉండి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వర్తించనివారు దర్తి గ్రామసభలో నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 20 పథకాలకు లబ్ధిదారుల గుర్తింపు ఈ గ్రామసభల్లోనే జరుగుతుందన్నారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ, దర్తి అబా జన్ భగీరది అభియాన్ కింద మండలంలోని 17 గ్రామాలు ఎంపికయ్యాయన్నారు. ఆయా గ్రామాల్లో ప్రతిఒక్కరికీ ఆధార్, రేషన్‌కార్డు, ఉపాధి జాబ్‌కార్డు, అర్హులకు పింఛన్లు ఇళ్లు, ఇతర ప్రయోజనాలు కలిగి ఉండాలని, ఇప్పటివరకు ఉంటేసరి, లేకుంటే గ్రామసభల ద్వారా అర్హులను గుర్తించి వారిని సంక్షేమ పథకాలను అందజేస్తారన్నారు. దీంతోపాటు తాగునీరు, రహదారులు ఇతర సామాజిక అవసరాల కల్పనకు చర్యలు చేపడతారన్నారు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు కార్యక్రమంలో విఆర్ఒ కోటి బాబు, పంచాయతీ కార్యదర్శి ధర్మ, ఎంపిటిసి తవిటినాయుడు, మాజీ ఎంపిటిసి కొర్ర కొండమ్మ, టిడిపి నాయకులు అప్పలస్వామి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మజ్జి. భీమరాజు, రవి, బొంటు శంకరరావు, మొద్దాని కష్ణ, నానాజీ , చిన్నారావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఐవి

## కులమతాలు, రాజకీయాలకతీతంగా 'కందుల' సేవ

**ప్రజాశక్తి - ఎటపాక:** అమరజీవి కామ్రేడ్ కందుల శ్రీనివాసరావు కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా సేవలందించారని పార్టీ జిల్లా కమిటి సభ్యులు ఐవి కొనియాడారు. కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు పులుసు బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ముందుగా ఐవి కందుల శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను సిపిఎం సీనియర్ నాయకులు పులుసు సూర్యనారాయణ ఎగుర వేశారు. అనంతరం ఐ.వి. మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడటం కోసం కరోనాను సైతం లెక్కచేయకుండా ప్రజాసేవ చేసి, అదే కరోనాకు బలి అయిన నిస్వార్ధ జీవి, త్యాగశీలి కందుల శ్రీనివాస్ అని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు తానికొండ వాసు, సిపిఎం శాఖ కార్యదర్శి కందుల సతీష్, స్థానిక సిపిఎం నాయకులు ఎ.నాగేంద్ర, పులుసు సత్యనారాయణ, పులుసు కోటేశ్వరరావు, జంగిలి రాము తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న సింగ్

# డిపిఆర్ఒగా బాలమాన్ సింగ్

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఒ)గా కె.బాలామాన్‌సింగ్ మంగళవారం ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిపిఆర్ఒగా విధులు నిర్వహించిన పి.గోవిందరాజులును శ్రీకాకుళం డిపిఆర్ఒగా నియమించారు.ఆయన మంగళవారం విధుల నుండి రిలీవ్ అయ్యారు. గోవిందరాజులకు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే కొత్త డిపిఆర్ఒను స్వాగతించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళుతున్న డిపిఆర్ఒ గోవిందరాజులు మాట్లాడుతూ మూడేళ్ల నుండి ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలలో సహకారం అందించిన అధికారులకు, పాత్రికేయులకు ధన్యావాదాలు తెలిపారు. అల్లూరి జిల్లాలో సేవలందించడం సంతృప్తికరంగా ఉందన్నారు.కార్యక్రమంలో డివిజనల్ పౌర సంబంధాల అధికారి పి.రాములు, సీనియర్ సహాయకులు పి.శ్రీనివాసరావు, జూనియర్ సహాయకులు కె.సంధ్యారాణి, వరలక్ష్మి, పుష్ప పాల్గొన్నారు.



బదిలీ డిపిఆర్ఒ గోవిందరాజులును సత్కరిస్తున్న కార్యాలయ ఉద్యోగులు

## ఉపాధ్యాయుడిని నియమించాలని ఆందోళన



పెదపాడులో ఆందోళన చేస్తున్న గిరిబాలలు, తల్లిదండ్రులు

**ప్రజాశక్తి డుంబ్రిగుడ:** ఉపాధ్యాయుడిని నియమించాలని పివిటిజి గిరిజనులు ఆందోళన చేపట్టారు. వివరాలు. కొర్రా పంచాయతీ పెదపాడు గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల కొనసాగుతుంది. ఐటీడీఏ పరిధిలో కొనసాగుతున్న ఈ పాఠశాలలో గతేడాది సిఆర్‌టితో నిర్వహించారు. ఈ ఏడాది పాఠశాలలు పున:ప్రారంభమై ఆరు రోజులు గడిచినా సిఆర్‌టిలను నియమించకోవడంతో పిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సాగర పంచాయతీ అడపవలసలోనూ ఉపాధ్యాయుడిని నియమించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

# ఫలితాల్లో టాప్..వసతుల్లో ఫ్లాప్

- బైపిసి, ఎంపిసి గ్రూపులు ఎత్తివేత
- విద్యార్థులకు హాస్టల్ వసతి లేక అవస్థలు



సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

**ప్రజాశక్తి -సీలేరు :** సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల అరకొర వసతులతో అల్లాడుతోంది. జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు కృషితో మంజూరైంది. బైపిసి, ఎంపిసి, సిఇసి, హెచ్‌ఇసి గ్రూపులతో కళాశాల ప్రారంభమైంది. జెన్కో గెస్ట్ హౌస్ దిగుభాగం ఉన్న ఎపి జెన్‌కో రేకులషెడ్‌లో 1992లో దీనిని నిర్వహించారు. అనంతరం సిబ్బందిని నియమించి పక్కభవనాలు నిర్మించే వరకూ ఇందులోనే తరగతులు నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. గత కొన్ని సంవత్సరాలు నాలుగు గ్రూపులు కొనసాగాయి. తర్వాత క్రమేపి పూర్తిస్థాయి భవనాల కొరత, ల్యాబ్ కొరత వల్ల ఎంపిసి, బైపిసి గ్రూపులు ఎత్తేశారు. అధ్యాపకులను విశాఖపట్నం ప్రభుత్వ కృష్ణ జూనియర్ కళాశాలకు బదిలీ చేశారు. అనంతరం సిఇసి, హెచ్‌ఇసి గ్రూపులను మాత్రం నడుపుతున్నారు. ఎపి జెన్కో భవనాల్లో నిర్వహిస్తున్న తరగతి గదులు సిమెంట్ రేకులు పూర్తిగా శిథిలమై వర్షపు నీరు తరగతి గదుల్లో కారిపోతుండేది. గత వైయస్సార్ ప్రభుత్వంలో నాడు నేడు పనుల్లో భాగంగా కళాశాలకు నిధులు మంజూరు చేశారు. దీంతో కళాశాలకు నూతనంగా టాయిలెట్స్, తరగతి గదులకు పైకప్పులు మరమ్మత్తులు నిర్వహించి సమస్యలు తలెత్తకుండా ప్రిన్సిపాల్, అధ్యాపకులు చర్యలు చేపట్టారు. ప్రతి ఏడాది 100 నుంచి 150 మంది విద్యార్థులు సిఇసి హెచ్‌ఈసి గ్రూపుల్లో చదువుతూ శతశాతం ఉత్తీర్ణత సాధిస్తుండడం విశేషం. 2024 మార్చిలో విజయనగరం జిల్లా బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై ఈ కళాశాలకు ప్రిన్సిపాల్ వి.శంకర్రావు వచ్చారు. ఉత్తమ విద్యని అందించడంతో సత్ఫలితాలు సాధించారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందిస్తున్నారు. కాకపోతే హాస్టల్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఉన్నాయి. ప్రస్తుతం ఒక ప్రైవేట్

**వసతులు కల్పిస్తే ఇంకా మంచి ఫలితాలు**



ఇటువంటి పేరు ఉన్న కళాశాలకు వసతులు పూర్తిగా లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఇంటర్ బోర్డు కమిషనర్‌కు కలెక్టర్ తదితర అధికారులకు సౌకర్యాలు కల్పించాలని నివేదించాం.


**- వి.శంకరరావు, ప్రిన్సిపాల్.**

**పక్కా భవనాలు, ప్రహరీ ఏర్పాటు చేయాలి**



కళాశాలలో హాస్టల్ వసతి సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు గురవుతున్నాం. శాశ్వత భవనాలు, ప్రహరీ నిర్మించాలి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

**- శెట్టి సాయికుమార్,**



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

## అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి- రాజవొమ్మంగి:** ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని జడ్డంగి ఎస్ఐ చినబాబు సూచించారు. మండలంలోని గడువొకూర్తి గ్రామాన్ని మంగళవారం సందర్శించి మాట్లాడారు. గ్రామంలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. గంజాయి తరలించినా, విక్రయించినా, సహకరించిన, అదేవిధంగా నాటుసారా క్రయ, విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'ఆ అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలి'

**ప్రజాశక్తి - అడ్డతీగల :** స్థానిక మండల కేంద్రం తిమ్మాపురం పంచాయతీ తిమ్మాపురంలో అంగనవాడి సెంటర్-2 నుండి కార్యకర్త అక్రమంగా బియ్యం, పప్పు, నూనె, కోడిగుడ్లను విక్రయించేందుకు తరలిస్తుందగా గ్రామస్తులు గమనించి పై అధికారులకు సమాచారం అందించారు. ఐసిడిఎస్ అధికారులకు వస్తువులను అప్పగించారు. సంఘటన జరిగి 4 రోజులు అవుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు 'ప్రజాశక్తి'కి మంగళవారం గ్రామస్తులు తెలిపారు. దీనిపై సూపర్‌వైజర్ అరుణలతను సమాచారం కోరగా ఆమె సంఘటన జరగడం వాస్తవమేనని బియ్యం70 కేజీలు, పప్పు 11 కేజీలు, నూనె2 ప్యాకెట్లు 60 కోడిగుడ్లు తీసుకుని తిరిగి గ్రామస్తులకే అప్పగించామన్నారు. సెంటర్ నుంచి వెళ్లిపోయిన పిల్లలకు కూడా హాజరు నమోదు చేసి ఆ కార్యకర్త సరుకులు తెచ్చుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# తల్లులతో బ్యాంకులు కిటకిట

## 'తల్లికి వందనం' డబ్బులు విత్‌డ్రాకు బారులు



మండల కేంద్రంలో బ్యాంకు వద్ద ఉన్న తల్లులు, ఇతర ఖాతాదారులు

**ప్రజాశక్తి జి.మాడుగుల:** బ్యాంకు ఖాతాల్లో జమైన తల్లికి వందనం డబ్బులను డ్రాచేసేందుకు పెద్దఎత్తున లబ్ధిదారులు రావడంతో మండల కేంద్రంలోని బ్యాంకులు తల్లులతో కిటకిటలాడుతున్నాయి. మండలంలోని 17 పంచాయతీల నుంచి తల్లికి వందనం లబ్ధిదారులంతా ఒకేసారి నగదు విత్‌డ్రా చేసేందుకు బ్యాంకుకు వచ్చారు. బ్యాంకులో గంటల తరబడి పడిగాపులు పడి, క్యూలైన్లలోబారులు దీరిన లబ్ధిదారులకు కొందరికే డబ్బులు అందగా, మిగిలిన వారంతా నిరాశకు గురయ్యే పరిస్థితి ఉంది.

బ్యాంకులో సరిపడా నగదు లేకపోవడంతో క్యూలైన్లలో ముందున్న కొంతమందికి మాత్రమే నగదు అందింది. దీంతో మిగిలిన నిరాశకు గురయ్యారు. అయితే మారుమూల గ్రామాల నుంచి మళ్లీ తల్లికి వందనం డబ్బులకు బ్యాంకుకు రావాలంటే వ్యయప్రయాసలతోపాటు, సమయాభావంతో కూడుకున్నది కావడంతో వారంతా ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి నగదు డ్రాచేసుకున్నారు. చాలామంది లబ్ధిదారులు తీసుకున్న నగదుకు కమీషన్ ముట్టజెప్పి, నగదుతో వెనుదిరిగారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ సాల్మన్‌రాజ్

## మౌలిక సదుపాయాల కల్పనే 'దర్తీ అభజన భగీదరి' ధ్యేయం

**ప్రజాశక్తి-దేవీపట్నం :** దేవీపట్నం మండలం శరభవరం, దేవారం గ్రామంలో దేవీపట్నం మండలం ఎంపిడిఒ ఎస్ సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో దర్తీ అభజన భగీదరి అభియాన్ జన్‌మాన్ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. గిరిజన మారుమూల గ్రామాలకు ఈ పథకం ద్వారా అవగాహన కల్పిస్తామని ఏజెన్సీలోనే దర్తీ అభాజన జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్ పథకం అమలు చేయటానికి సమస్యలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారులకు అన్ని పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ప్రతికుటుంబానికి బ్యాంక్ అకౌంట్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సరభవరం దేవారం ఎంపిటిసి తుర్రం జగదీష్‌దొర, దేవారం సర్పంచ్ తుర్రం రమాదేవి, శరభవారం సర్పంచ్ లక్ష్మి శ్రీనివాస్, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత

**ప్రజాశక్తి డుంబ్రిగుడ:** ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగాను ఆస్వాదిస్తే శారీరక, మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని ఎంపిడిఒ ప్రేమ్ సాగార్ అన్నారు. మండల కేంద్రంలోని పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్మికులు పాల్గొని పలు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఎఇఇ అజయ్, ఇన్చార్జి ఇఒపిఆర్‌డి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎంఆర్‌సిలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్** : స్వచ్ఛభారత్ మిషన్‌లో పనిచేస్తున్న మండల రిసోర్స్ కోఆర్డినేటర్లు (ఎంఆర్‌సి)లకు తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపిసి నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ తదితర పనులు చేస్తున్న ఎంఆర్‌సిలను ఆప్కాస్‌లో అవుట్‌సోర్సింగ్ ద్వారా నియమించారన్నారు. వీరికి ప్రతినెలా వేతనం సక్రమంగా అందకపోగా, ఎపుడు వస్తుందో కూడా తెలియదని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు బడ్జెట్ కేటాయింపులపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఉద్యోగం చేస్తున్న వీరికి ఇస్తున్నది అరకొర వేతనాలైనా సకాలంలో అందకపోవడంతో కుటుంబపోషణకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా పరిగణించడం సరికాదన్నారు. ప్రభుత్వాలు దీనిపై పరిశీలన చేసి, ఎంఆర్‌సిలతోపాటు కాంట్రాక్టుపద్ధతిన పనిచేస్తున్న అందరు ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి, బుంగా గంగరాజు పాల్గొన్నారు.

## సచివాలయంలో 'తల్లికి వందనం' దరఖాస్తులు

**ప్రజాశక్తి -నక్కపల్లి** : తల్లికి వందనం పథకం దరఖాస్తుదారులతో గ్రామసచివాయాలు నిండిపోయాయి. ఈ పథకం కింద అనర్హత పొందిన లబ్ధిదారులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ వెల్లడించడంతో వారంతా మళ్లీ దరఖాస్తు చేసేందుకు క్యూ కట్టారు. నెలసరి విద్యుత్ వినియోగం సగటున 300 యూనిట్లు కంటే ఎక్కువగా ఉండటం, కుటుంబం,, లబ్ధిదారులకు సాగు భూమి 3 ఎకరాల కంటే ఎక్కువగా ఉండం, కుటుంబంలో రూ.12 వేల టే ఎక్కువ జీతం తీసుకున్నవారు, ఆదాయ పన్ను చెల్లించడం వంటి కారణాలుగా పలువురిని అనర్హుల జాబితాలో చేర్చి ఇటీవల తల్లికి వందనం పథకం కింద వారి ఖాతాలకు డబ్బులు జమకాలేదు. సచివాలయాల వద్ద, ఆన్‌లైన్‌లోనూ ప్రకటించిన జాబితాలో అనర్హతకు కారణాలను గుర్తించిన లబ్దిదారులు వాటికి సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేస్తున్నారు.ఎక్కువ మంది లబ్ధిదారులకు విద్యుత్ వినియోగం కారణాలనే చూపుతూ అనర్హులుగా తేల్చడంతో ఎపిఇపిడిసిఎల్ కార్యాలయాల చుట్టూ తిరిగి, తమ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించిన బిల్లులను తీసుకుని వాటి ఆధారంగా దరఖాస్తులు అందజేస్తున్నారు.

## అధిక ధరలకు గ్యాస్ విక్రయాలు

### చోద్యం చూస్తున్న సివిల్ సప్లై అధికారులు

**ప్రజాశక్తి- కోటవురట్ల:** మండలంలో గ్యాస్ వినియోగదారుల నుంచి హెచ్‌పి నిర్వాహకులు సిలిండర్ ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.870 కాగా రూ.900 వసూలు చేస్తున్నారు, ఇది కాకుండా డెలివరీబాయ్‌కు మరో రూ.10 చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు, మండలంలో అధికంగా హెచ్ పి గ్యాస్ వినియోగదారుల ఉండడంతో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు అమ్మకాలు చేపట్టడంతో వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు, వాస్తవానికి గ్యాస్ వినియోగదారులకు డోర్ డెలివరీ ఉచితం చేయాల్సి ఉంటుంది, అంతేకాకుండా డోర్ డెలివరీ సమయంలో గ్యాస్ బండను కాటాపై తూచి ఇవ్వాల్సి ఉంటుంది, డెలివరీ వాహనంపై కాటా సైతం లేకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి, అంతేకాకుండా పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు, ఈ విషయంపై సంబంధిత సివిల్ సప్లై అధికారి కుమార్ ను వివరణ కోరగా నిర్దేశించిన రేటు కంటే అధిక ధరలకు విక్రయించినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. అదనంగా ఎవరు డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ కు1800 258 7170ఫిర్యాదు చేసినట్లయితే డీలర్ల దగ్గర నుంచి జరిమానా విధిస్తామని తెలిపారు.

# పిఎం జన్‌మన్ గృహ నిర్మాణాల్లో ముందంజ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న హౌసింగ్ ఎఇ ఈశ్వరరావు

**ప్రజాశక్తి -జి.మాడుగుల** : పిఎం జన్‌మన్ గృహనిర్మాణంలో జి.మాడుగుల మండలం ముందంజలో ఉంది. మారుమూల గ్రామాల్లోని లబ్ధిదారులను చైతన్యపరిచి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంలోనూ, నిర్మాణాల ప్రాప్తికి బిల్లులు చెల్లింపు, ఏవైనా సమస్యలుంటే వాటి సత్వర పరిష్కారం, చివరకు పూర్తయిన తర్వాత గృహనిర్మాణాల్లో స్థానిక మండల హౌసింగ్ ఎఇఇ ఈశ్వరరావు చొరవ, కృషి మంచి ఫలితాలను ఇస్తోందని లబ్ధిదారులతోపాటు స్థానికులు అంటున్నారు. ఇతర మండలాలతో పోలిస్తే గృహనిర్మాణంలో మంచిపురోగతిలో ఉండేలా కృషి చేస్తున్న ఎఇఇ ఈశ్వరరావును ఉన్నతాధికారులతోపాటు లబ్ధిదారులు ప్రశంసిస్తున్నారు.

పిఎం జన్‌మన్ కింద జి.మాడుగుల మండలంలో 2,247 ఇళు మంజూరయ్యాయి. అయితే మారుమూల పివిటిజి గిరిజన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాల్లో నెలకొన్న సమస్యలు, ఇతర ఇబ్బందులపై స్థానిక ఎఇఇ ఈశ్వరరావు ప్రత్యేక దృష్టి పెట్టి, లబ్ధిదారులను చైతన్యపరచడంతోపాటు నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సాహించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. మారుమూల, కొండశిఖర గ్రామాలను సైతం తరచూ సందర్శిస్తూ, లబ్ధిదారులను పదేపదే కలుస్తూ, వారిని గృహనిర్మాణాలకు ప్రోత్సాహిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థికప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని, ప్రతిఒక్కరూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఉత్తేజపరుస్తూ ప్రోత్సాహిస్తున్నారు నిర్మాణాల ప్రాప్తికి వాటిని ఆన్‌లైన్ చేయడం, లబ్ధిదారులకుసక్రమంగా బిల్లులు చెల్లించేలాచర్యలు చేపట్టడం ద్వారా ఇళ్ల నిర్మాణాలకు సహకరిస్తున్నారు. నిత్యం మండల కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలోనే లబ్ధిదారులకు అందుబాటులో ఉంటూ, ఏమైనా సాంకేతిక సమస్యలున్నా, ఎవరికైనా బిల్లులు పడకపోయినా, ఆన్‌లైన్‌లో గృహ పత్రాలు నమోదు కాకపోయినా, ఇంకా ఇతరత్రా ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా, తానే నేరుగా దగ్గరుండి పర్యవేక్షించి ఎప్పటి పనులను అప్పుడు సిబ్బందితో పూర్తయ్యేలా చేయిస్తున్నారు. లబ్ధిదారులు పదేపదే కార్యాలయాల చుట్టూగానీ, బిల్లుల కోసం తిరిగే అవకాశం లేకుండా చర్యలు చేపట్టడంతోపాటు, పివిజిటి లబ్ధిదారులను అన్నివిధాలా సమాయత్తం చేస్తూ గృహనిర్మాణాలలో మంచి పురోగతి సాధిస్తున్నారని పలువురు ప్రశంసిస్తున్నారు.

# 'చంద్రన్నంటే మోసం' పుస్తకావిష్కరణ



ముంచంగిపుట్టులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్, ఎంపిపి

**ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:** స్థానిక వైసిపి కార్యాలయం వద్ద మంగళవారం చంద్రన్న అంటేనే మోసం - జగనన్న అంటే నమ్మకం అనే పుస్తకాన్ని ఎంపిపి అరిసెల సీతమ్మ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉమ్మడి జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ఏడాది కూటమి ప్రభుత్వం పరిపాలనలో ప్రజలు మోసపోయారన్నారు సూపర్ సిక్స్ పథకాలు అమలులో పూర్తిగా విఫలమయ్యారని, తల్లికి వందనం పథకాన్ని నిబంధనలు, షరతులు పెట్టి, కొందరికే పరిమితం చేశారని ఆరోపించారు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందిన కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించడంతోపాటు హామీల సాధనకు ప్రజాఉద్యమానికి సన్నద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల ముఖ్య నేత జగబంధు, సర్పంచులు, ఎంపిటిసిలు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెదబయలు :** సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని వైసిపి మండల అధ్యక్షుడు మజ్జి చంద్రబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. అందరికీ ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి ఇతర హామీలను అమలు చేయాలన్నారు. ప్రజలను మభ్యపెట్టి, ఓట్లను దండుకున్న కూటమి నేతలు, ఇపుడు హామీల అమలులో నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సందడి కొండబాబు, పి ధనరాజు, ఉపాధ్యక్షుడు జుంబు పూర్ణయ్య, టి వెంకటరావు రాజు, వి దాసుబాబు పాల్గొన్నారు

# ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాశక్తి -డుంబ్రిగుడ**: మండలంలోని కించమండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం గెన్ను తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులకు మాట్లాడుతూ మూడో తరగతిలో 40, నాలుగవ తరగతిలో 40, ఐదవ తరగతిలో 40, ఆరవ తరగతిలో 25, ఏడవ తరగతిలో 10, ఎనిమిదవ తరగతిలో 10, 9వ తరగతిలో 10, పదవ తరగతిలో 8 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రవేశం పొందాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల డిప్యూటీ వార్డెన్ కె.రాంబాబు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుడు మృతి

**ప్రజాశక్తి-ఉక్కునగరం** :.విశాఖ స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్ బ్యాటరీ 3, సిడిసిపి3లో పైనుంచి జారి పడి కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. కోక్ ఓవెన్ విభాగం సిడిసిపి 3 లో ప్రాంప్టు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ విల్సన్ వద్ద పనిచేస్తున్న స్కిల్డ్ కార్మికుడు కెవి.రమణ (53) ట్రాన్స్ ఫార్మర్ మార్చడానికి పైకి ఎక్కాడు. 50 మీటర్ల ఎత్తులో పని చేస్తుండగా నిల్చున్న షీటు విరిగి పోవడంతో క్రిందకు జారి పడి పోయాడు. వెంటనే కోక్ ఓవెన్ ఫస్టు ఎయిడ్‌కు, తర్వాత కెజిహెచ్‌కు అతన్ని తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు కెజిహెచ్ వైద్యులు నిర్ధారించారు. గాజువాకలో ఏదైనా ఆసుపత్రికి తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందించి ఉంటే కార్మికుడు బతికేవాడని, కాంట్రాక్టర్, యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల మృతి చెందారని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. కార్మికునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గాజువాక డిపో సమీపంలోని నక్కవానిపాలెంలో నివాసముంటున్నాడు.

**నష్టపరిహారం చెల్లించాలి**

ఉక్కు యాజమాన్యం సరైన భద్రతాచర్యలు పాటించకపోవటం వల్లే ప్రమాదం జరిగిందని, తగు నష్టపరిహారం చెల్లించాలని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కార్మికులను తగ్గించి పనిభారం పెంచటం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం పునరాలోచించి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. నాయకులు నమ్మి రమణ, సోంబాబు, నగేష్, ఉరుకుటి అప్పారావు, నాగరాజు మాట్లాడుతూ కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

## అదృశ్యమైన మహిళ హత్య?

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : స్థానిక బీచ్ రోడ్డు మార్లిన్ కే హోటల్ ఎదురుగా ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతంలో ఓ మహిళ మృతదేహం మంగళవారం పోలీసులకు లభ్యమైంది. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. చనిపోయి దాదాపు 10 రోజులుపైబడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ప్రకారం.. చెట్టుకు చున్నీతో మహిళ జుట్టు వేలాడి ఉండడం, కింద పడిన చెప్పులు, బట్టలు, మృతురాలి చేతి పై ఉన్న పచ్చ బొట్టు ఆధారంగా జివిఎంసి మూడో వార్డు కృష్ణా కాలనీకి చెందిన వివాహిత బంగారు కవిత (28)గా గుర్తించారు. సంఘటనా స్థలానికి సిఐ బి.తిరుమలరావు, ఎస్ఐ రాధాకృష్ణ, క్లూస్ టీం చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి కారణాలను లోతుగా విచారణ చేస్తున్నారు. మృతురాలు కవిత కొంతకాలం ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేశారు. ఆమె భర్త పైడిరాజు చిప్పాడ దివీస్‌లో డ్రైవర్‌గా పని చేసేవారు. వీరికి వివాహమై సుమారు తొమ్మిదేళ్లు అయింది. ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. 9 ఏళ్ల కుమార్తె సమీరా, ఏడాది కుమార్తె వర్షిత ఉన్నారు. మృతురాలు చేతిపై వర్షిత అని పచ్చ బొట్టు ఉండడంతో కవితగా కుటుంబ సభ్యులు నిర్ధారణకొచ్చారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన కుమార్తె తమ కుమార్తె కవిత అదృశ్యమైనట్లు మృతురాలి తల్లిదండ్రులు వరలక్ష్మి, శ్రీను మే నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక తోట వీధికి చెందిన రాజు కిడ్నాప్ చేసి ఉంటాడని అనుమానం వ్యక్తంచేశారు. రాజు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు కుట్ర పన్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు దారి తీసి ఉంటుందన్న కోణంలో పోలీసులు విచారణ వేగవంతం చేశారు.

## బైక్‌ల దొంగ అరెస్టు

**ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ :** ద్విచక్ర వాహనాలను అపహరించిన మాకాల ధనుకుమార్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు వివరాలను సిఐ విజయకుమార్ మంగళవారం వెల్లడించారు. అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు నిందితుడు మాకాల ధనుకుమార్‌ను అరెస్టు చేసి ఆయన నుండి ఏపి 31డిజి 4110 నెంబర్ గల గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని, గతంలో దొంగిలించిన ఏపి 31సిడబ్ల్యూ 3137 నెంబర్ 150సిసి పల్సర్ బండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

**ప్రజాశక్తి-దేవరాపల్లి :** మండల కేంద్రం దేవరాపల్లి గాలి వీధిలో ఈనెల 13న నిద్రిస్తున్న భార్యపై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడు కోన రామును మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై టి.మల్లేశ్వరరావు తెలిపారు. కుటుంబ కలహాలతో భార్య కోన దేవిని కత్తితో దాడి చేసి పరారైన రామును స్థానిక జగనన్న కాలనీలో పట్టుకొని రిమాండ్ నిమిత్తం చోడవరం కోర్టుకు తరలించినట్లు ఎస్సై విలేకరులకు చెప్పారు.

## బైక్ చోరీ

**ప్రజాశక్తి -సీలేరు:** జికె వీధి మండలం సీలేరులో పల్సర్ బైక్ చోరీకి గురైంది. బాధితుడు వంతల భగత్ రాం తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఎపి జెన్‌కో కాలనీ 5వ క్రాస్‌రోడ్డు సిద్ధార్థ కుమార్ ఇంటి సమీపంలో ఉన్న స్నేహితుడు ఇంటికి మధ్యాహ్నం వెళ్లి ఇంటిముందు బైకు హ్యాండ్‌లాక్ వేసి పార్క్ చేశానన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు బైక్ ఉందన్నారు. రాత్రి 9 గంటలకు చూసేసరికి కనబడలేదని చుట్టుపక్కల పరిశీలించిన కనబడలేదని దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్సై రవీంద్ర సిబ్బందితో పరిశీలించారు. అలాగే అదే క్రాస్‌రోడ్ లో రిటైర్డ్ ఎపి జెన్కో ఉద్యోగి సిద్ధార్థకుమార్ ఇంటి కిటికీని తొలగించి లోపల బీరువా పగలగొట్టినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఎస్ ఐ రవీంద్ర స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ బాధితుడు ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సీలేరులో అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లయితే తమకు వెంటనే సమాచారం చేరవేయాలని ఎస్సై రవీంద్ర సూచించారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డికె హిమబిందు

## జ్వరబాధితులు కచ్చితంగా రక్తపరీక్షలు చేయించుకోవాలి

**ప్రజాశక్తి - సీలేరు :** గిరిజన గ్రామాల్లో జ్వరబాధితులు కచ్చితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని దారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డికె హిమబిందు అన్నారు. మంగళవారం మాదిగమల్లులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 97 మందికి సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఐదుగురు జ్వరబాధితులకు రక్త పరీక్షను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. జ్వరబాధితుల్లో మలేరియా నిర్ధారణ కాలేదు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడం వల్ల గ్రామాల్లో జ్వరాలు, అతిసార ప్రబలే అవకాశం ఉందని, వ్యాధి సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం గిరిజన గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేస్తున్నారని, ఇళ్లలో నూరు శాతం మందు పిచికారి చేయించుకోవాలన్నారు. దోమల మందు రంగు, వాసన ఉండదని, కేవలం దోమలపైనే మాత్రమే ప్రభావం చూపుతుందని ఆమె తెలిపారు. ఆదివాసీలు పసర మందులు, నాటువైద్యానికి దూరంగా ఉండాలని తెలిపారు. గర్భిణులు తరచూ వైద్యపరీక్షలు చేయించుకుని ఆసుపత్రిలోనే ప్రసవం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లోకకుమారి, ఎఎన్ఎం సీతమ్మ పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదని ప్రకటించాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖపట్నం విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, సొంత గనులు కేటాయిస్తామని ప్రకటించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1585 రోజుల పైబడి స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ప్రజలు, కార్మికులు ఉద్యమిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

## కెజిహెచ్ ఆర్ఎంఒ మెహర్ బదిలీ

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** కెజిహెచ్ డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్ఎంఒ డాక్టర్ మెహర్ కాకినాడ జిజిహెచ్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అయితే ఆయన స్థానంలో ఎవరినీ కెజిహెచ్‌కు కేటాయించలేదు.

## విద్యార్థులకు కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** ఎంవిపి కాలనీ జివిఎంసి 18వ వార్డులో ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ మంగవేణి పోలారపువే విద్యార్థులకు స్కూల్‌కిట్, బ్యాగు, పుస్తకాలు, యూనిఫామ్‌లు విద్యార్థులకు అందజేశారు. సుమారు 164 మంది విద్యార్థులకు పాఠశాల కిట్లు అందించారు.

# నేడు భారత నావికాదళంలోకి 'అర్నాల'

### ఎన్నో ప్రత్యేకతలు సొంతం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)**

డైరెక్టరేట్ ఆఫ్ షిప్ ప్రొడక్షన్ మార్గదర్శకత్వంలో కొల్‌కతాలోని కట్టుపల్లిలో యుద్ధనౌకల పర్యవేక్షణ బృందాల నేతృత్వాన నిర్మించబడిన మొదటి యాంటీ సబ్‌మెరైన్ వార్ ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ నౌక అర్నాలను విశాఖపట్నంలోని నావల్ డాక్‌యార్డ్‌లో బుధవారం ప్రారంభించేందుకు భారత నావికాదళం ఏర్పాట్లు పూర్తి చేసింది. తూర్పు నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ హాజరు కానున్నారు. పదహారు యాంటీ సబ్‌మెరైన్ వార్ ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్ తరగతి నౌకల్లో అర్నాల మొదటిది కావడం విశేషం. కొల్‌కతాలోని మెస్సర్స్ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ ద్వారా మెస్సర్స్ ఎల్ అండ్ టి షిప్‌బిల్డర్స్‌తో పిపిపి పద్ధతిన దీన్ని రూపొందించారు. మే 8న నావికాదళానికి అప్పగించారు. ఈ యుద్ధనౌక 80 శాతం కంటే ఎక్కువ స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకుందని అధికారులు చెబుతున్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఎల్ అండ్ టి, మహీంద్రా, డిఫెన్స్, ఎంఇఐఎల్ వంటి ప్రముఖ భారతీయ సంస్థల నుండి అధునాతన వ్యవస్థలను అనుసంధానించామని, ఈ ప్రాజెక్టులో 55కి పైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కలిసి పనిచేశాయని తెలిపారు. వివిధ రకాల కార్యకలాపాల కోసం ఈ నౌక తోడ్పడనుందన్నారు. సబ్‌సర్ఫేస్ సర్వైలెన్స్, సెర్చ్, రెస్క్యూ మిషన్స్, ఇంటెన్సిటీ మారిటైమ్ ఆపరేషన్‌లను నిర్వహించడానికి దీన్ని నిర్మించినట్టు పేర్కొన్నారు. 1490 టన్నులకుపైగా బరువు, 77.6 మీటర్ల పొడవును ఈ యుద్ధనౌక కలిగి ఉందని, డీజిల్ ఇంజిన్, వాటర్‌జెట్ కలయిక ద్వారా నడపబడే అతిపెద్ద భారతీయ నావికా యుద్ధనౌక అని పేర్కొన్నారు. ఇది తీరప్రాంత రక్షణను బలోపేతం చేయనుందని తెలిపారు. కీలకమైన హిందూ మహాసముద్ర ప్రాంతంలో శక్తివంతమైనదిగా పనిచేయనుందన్నారు.



అర్నాల యుద్ధనౌక

**ఏమిటీ అర్నాల ?**

మహారాష్ట్రలోని వాసాయిలోగల చారిత్రాత్మక అర్నాల కోట పేరును ఈ యుద్ధ నౌకకు పెట్టారు. ఇది భారతదేశ సముద్ర వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని, దేశ రక్షణలో కోట మాదిరి నిలుస్తుందని అధికారులు వెల్లడించారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి




మాట్లాడుతున్న వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:** అధికారులు సమన్వయంతో పనిచేసి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు పేర్కొన్నారు. మంగళవారం ఎ.యు. కన్వెన్షన్ సెంటరులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రంలో యోగాంధ్ర విధుల ప్రత్యేక అధికారులు, పోలీసు, వివిధ శాఖల అధికారులతో బస్సులు ఏర్పాటు, ప్రజలు, విద్యార్థుల తరలింపు, పార్కింగు, ట్రాఫిక్, పారిశుధ్యం తదితర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ కార్యక్రమానికి విచ్చేసే ప్రజలు, విద్యార్థులను జాగ్రత్తగా తీసుకురావడం, ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా కేటాయించిన స్థలాలకు చేర్చడం తిరిగి క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం, పాడేరు, అనకాపల్లి జిల్లాల నుండి వచ్చే ప్రజలను వారికి కేటాయించిన బ్లాకులకు నేరుగా తరలించాలన్నారు. వారికి కేటాయించిన బ్లాకులకు సంబంధించి సమాచారం, పార్కింగు వివరాలను సంబంధిత సిబ్బందికి ముందుగానే తెలియజేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో మైక్, లైటింగు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీసు, ఆర్.టి.సి., రవాణా శాఖ సిబ్బందిని నియమించాలన్నారు. ప్రతి బస్సుపై సంబంధిత సచివాలయం వివరాలను తెలియజేస్తూ బ్యానరు ఏర్పాటు చేయాలని తెలిపారు. యోగా చేసే ప్రతి కంపార్టుమెంటుకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. యోగా నిర్వహించే ప్రదేశాలకు దగ్గరలో గల పబ్లిక్ టాయిలెట్స్, వివిధ హోటల్, రెస్టారెంట్స్ చెందిన టాయిలెట్స్ ప్రజలు వినియోగించుకు నేందుకు అవకాశం కల్పించాలన్నారు. తాగునీరు సరఫరా చేయాలని, టాయిలెట్స్, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాలని చెప్పారు.

## బెట్టింగ్ కేసులో 13 మంది అరెస్ట్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** బెట్టింగ్‌కు పాల్పడున్న 13 మంది ముఠా సభ్యులను విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం సాయంత్రం వెల్లడించారు. ఆయన కథనం మేరకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని బెట్టింగ్ ముఠా సభ్యులు అమాయకులను నమ్మిస్తున్నారు. వారి దగ్గర ఉన్న డబ్బు ఖాళీ చేసే బెట్టింగ్ వెబ్‌సైట్లను అలవాటు చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన సైబర్ క్రైమ్ పోలీసులు కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. మ్యూల్ బ్యాంకు అకౌంట్స్ నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన ఒక వ్యక్తిపై దృష్టి పెట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకున్నారు. అతని నుంచి కీలక సమాచారం రాబట్టారు. సదరు ముద్దాయి మ్యూల్ బ్యాంక్ ఖాతాలను సరఫరా చేస్తున్నాడు. ప్రధాన ముద్దాయి పర్యవేక్షణలో ఇదంతా కొనసాగిస్తున్నాడు. దీనిపైన నగర పోలీసులు మరింత కూపీ లాగారు. వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి ఆధునిక సాంకేతిక సహాయంతో బెట్టింగ్ కార్యకలాపాలు బెంగళూరు వేదికగా సాగుతున్నట్టు గుర్తించారు.

బిలేకహళ్లి, బెంగళూరులో ఉన్న ఒక డెన్‌ను గుర్తించారు. దానిపై దాడి చేసి అక్కడున్న 13 మంది నిందితులను అరెస్టు చేశారు. వారికి విశాఖపట్నం తీసుకొచ్చి రిమాండ్‌కు పంపించారు. 45 సెల్‌ఫోన్లు, 130 బ్యాంక్ బుక్స్, 4 ల్యాప్ టాప్‌లు, 33 ఎటిఎం కార్డులు, 2 కౌంటింగ్ యంత్రాలను సీజ్ చేశారు. మ్యూల్ బ్యాంక్ అకౌంట్లను కొరియర్ ద్వారా సేకరించి వాటిని ఆన్లైన్ బెట్టింగ్ కార్యకలాపాలకు ఉపయోగిస్తూ అమాయకులైన వారిని బెట్టింగ్‌లోకి లాగి అప్పుల పాలు చేస్తున్నారు. ఈ కేసును మరింత దర్యాప్తు చేస్తున్నామని సిపి తెలిపారు.



ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

## ఘనంగా గంగాదేవి మహోత్సవం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** గంగాదేవి పండగను మంగళవారం మత్స్యకారులు ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా చేపలవేట మొదలైన తరువాత వచ్చే మంగళవారం దీనిని నిర్వహిస్తారు. ఫిషింగ్ హార్బర్‌లోని గంగాదేవి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పసుపు, కలశాలతో మహిళలు పెద్దఎత్తున సముద్రం వద్దకు చేరుకుని సముద్రంలో గంగాదేవిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎపి బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పి.సిఅప్పారావు, అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, మహిళా ప్రతినిధులు ఎం.సోమాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 25న డివిజన్ స్థాయి పెన్షన్ అదాలత్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖపట్నం-1లోని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ప్రాంగణంలో ఈ నెల 25న మధ్యాహ్నం 3 గంటలకు పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు డివిజన్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం డివిజన్‌కు సంబంధించిన పెన్షన్ విషయాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులను ఈ నెల 23న లేదా అంతకుముందు చేరుకునేలా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, విశాఖపట్నం డివిజన్, విశాఖపట్నం-1కు పంపవచ్చన్నారు. ఆ తర్వాత వచ్చే ఫిర్యాదులు స్వీకరించబోమని తెలిపారు.

## వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా నాగేంద్ర

**ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ :** వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా జీలకర్ర నాగేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై నమ్మకంతో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, శాసనమండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, మాజీ శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జీలకర్ర నాగేంద్ర 2007 నుండి 2010 వరకు ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

## 20న విశాఖ వస్తున్న వైఎస్.షర్మిల

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిలారెడ్డి ఈనెల 18 నుంచి 3 రోజుల పాటు ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనకు వస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 20న విశాఖపట్నం వస్తున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు జగదాంబజంక్షన్ సమీపంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకుల సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగిస్తారని, పార్టీ జిల్లా అధ్యక్షుడు హసిని వర్మ మీడియాకు తెలిపారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా షర్మిల బుధవారం విశాఖపట్నం ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారని, అక్కడ నుంచి నేరుగా అరకు వెళ్లి మధ్యాహ్నం 3:30 గంటలకు అల్లూరి సీతారామరాజుజిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అదేరోజు విజయనగరం చేరుకుని రాత్రి అక్కడ బస చేస్తారని, గురువారం ఉదయం 10 గంటల నుంచి విజయనగరం జిల్లా కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు. అక్కడినుంచి శ్రీకాకుళం వెళ్లి 3:30 గంటలకు శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొంటారని,అనంతరం నేరుగా ఆమె విశాఖ నగరానికి చేరుకొని రాత్రి బస చేస్తారని తెలిపారు. మరుసటి రోజు ఉదయం విశాఖ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొంటారని, మధ్యాహ్నం భోజనం అనంతరం అనకాపల్లి వెళ్లి, మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.